● ఈ వారం కథ

# 'ఇది పిరికితనం కాదు'

డాక్టర్ గంటి శ్రీరామచంద్రమూర్తి

అపురూపంగా పొదివి పట్టుకుందామె ఆ వుత్తరాన్ని. మనస్సుకి సాంత్వన చేకూర్చి హృదయకుహరాన్ని అనురాగంతో నింపే శక్తి అక్షరాలకుందని ఆరు నెలల క్రితం తెలుసుకుంది. ఆ నిజం యివ్వాడు బలపడింది. ముప్పైఅయిదేళ్ళ జీవితంలో అందుకున్న మొట్టమొదటి ప్రేమలేఖ అది. అందుకే ఎన్నిసార్లు చదివినా తనివితీరడం లేదు.

"ప్రాణమా,

నువ్వు లేకుండా జీవించలేను. జీవితం స్వర్గ తుల్యంగా మార్చుకునే శక్తి మన చేతుల్లోనే వుంది. గమనించేవా చరితా, సాలెపురుగు తను కట్టిన గూటిలో ఎప్పటికీ చిక్కడిపోదు. మనిషి మాత్రం తను సృష్టించుకున్న బంధాల బందిఖానాలో మగ్గిపోతున్నాడు. ప్రేమ వేరు. చరీ, బంధాలన్నీ తెంచుకుని వచ్చేసెయ్. మరో నెలలో నేను వెళ్ళిపోతాను–నిన్ను వెంట తీసుకుని.

ముప్పై రోజుల్లో మనం కలసి జీవిస్తామన్న ఆశే నాకిపుడు వూపిరి–ఆ వూహే అప్పటి ద రకూ నా ప్రాణం నిలుపుతుంది.

–అరుణ్

వెళ్ళిపోతేనేం?

అనుమానం మొగుడూ, ఆరళ్ళు పెట్టే అత్తగారూ సాధించే ఆడపడచు, వీళ్ళందరినీ తప్పించుకుని అతనితో తోడు పంచుకుంటే?

"సిస్టర్" ఇన్‌ఛార్జి మెడికల్ ఆఫీసర్ పిలుపుకి తెప్పరిల్లి, తలెత్తిందామె.

"యస్ సర్"

"ఎం.ఎం.ఆర్. వేక్సిన్ వుందా?"

"ఉన్నాయి డాక్టర్"


"స్టాక్ లేకపోతే స్టోర్ నుంచి ఇండెంట్ చేయండి. రిజిస్టర్ ఒకసారి చెక్ చేసుకోండి. రేపు ఇన్‌స్పెక్షన్ వుంది" అని చెప్పి వెళ్ళిపోయేడతను.

రిఫ్రిజిరేటర్‌లో మందులన్నీ తనిఖీచేసి తలుపు మూస్తుంటే వచ్చేడతను.

అతని వునికి స్పష్టంగా తెలిసిపోతూంది. కళ్ళు దించి చూడనవసరం లేదు. పరిసరాల్లో అతనుంటే గుండె పక్షిలా రెక్కలు చాపుకుని ఛాతి పంజరాన్ని తప్పించుకునేందుకు టపటపా కొట్టుకుంటుంది. ఊపరి అనంతమవుతుంది.

"జవాబు సిద్ధంగా వుందా?"

అరుణ్ ప్రశ్నకి సమాధానం చెప్పలేదామె. ఆమె ఉక్కిరిబిక్కిరి అయిపోతూంది. అనాదరణా, నిర్లక్ష్యం సుడిగుండపు ప్రవాహమై ఇంట్లో వూపిరి సలపనివ్వకపోతే అరుణ్ ప్రేమా అను



రాగం వరదై నిలువునా ముంచెత్తి గాలి ఆడనివ్వడంలేదు.

రెండేళ్ళ క్రితం వచ్చేడతను క్వార్టర్స్‌కి. డిఫెన్స్ కాలనీ అది. ప్రభుత్వ డిస్పెన్సరీలో నర్సుగా పనిచేస్తూందామె.

సమాధానం ఆశించకుండా అతను భవిష్యత్తు నగరంలోని ఆమె చేయి పట్టుకుని తీసుకువెళ్ళిపోతున్నాడు.

అందమైన రంగుల స్వప్నం సృష్టించి భయంకరమైన గతానికి నిర్లిప్తమైన వర్తమానానికి సమాధి కట్టేస్తున్నాడు.

"నీ ఒరిజినల్స్ తీసుకుని వచ్చేయ్ చరితా. ఉద్యోగం చేయమని నిన్ను బలవంతం చేయను. నీ పాస్‌పోర్ట్ రెడీగా" వుంచు.

ఆమెకి అరుణ్ మాటలు అస్పష్టంగా వినిపిస్తున్నాయి.

ఇద్దరి పరిచయం అదే డిస్పెన్సరీలో జరిగింది. ఆమె అతని ప్రాణం కాపాడడంతో........

ఒంట్లో నలతగా వుండడంతో డిస్పెన్సరీకి వచ్చేడతను. స్టాఫ్ అందరూ వచ్చేశారు. అప్పటికింకా మెడికల్ ఆఫీసర్ రాలేదు. కడుపులో విపరీతమైన పోట్లు.....

దూరంగా వస్తున్న డాక్టర్‌ని చూసి ప్రాణం లేచివచ్చినట్టయింది. కానీ అతని గది ముందు జనాన్ని చూసి అక్కడ క్యూలో నిల్చునే ఓపిక లేక ఫార్మాసిస్ట్‌ని బ్రతిమాలి టేబ్లెట్ తెచ్చుకున్నాడు. వేసుకున్న రెండు నిమిషాలకి జరిగిందది.

క్షణం కళ్ళు చీకట్లు కమ్మి ముందుకి తూలి దభీమని శబ్దం చేస్తూ కుప్పకూలిపోయేడు. శరీరం తేలికైపోయింది. నోరంతా దురద. దూదిపింజెలా అయిపోతున్న కాయానికి జీవం పోయాలని కంకణం కట్టకున్న గుండె రేసు గుర్రంలా పరిగెడ్తూంది.

ఆ స్థితిలో మృదువైన హస్తం అతన్ని ఆప్యాయంగా పొదివి పట్టుకుని నేలమీద వెల్లకిలా పడుకోబెట్టింది.

కాళ్ళకింద దిండు పరచింది.

"క్విక్......ఇవి సెట్ తీసుకుని రండి"

ఆందోళన అలజడీ లేవా స్వరంలో. ప్రశాంతంగా విషమ స్థితి నెదుర్కునే సంసిద్ధత, దృఢత్వం వుందా కంఠంలో.

పది నిమిషాల తర్వాత కళ్ళు తెరచిన అతన్ని ఆమె చిరునవ్వుతో ప్రశ్నించింది. "ఎలా వుంది?"

ఆ క్షణంలో గుండె పారేసుకున్నాడతను.

పెళ్ళి చేసుకోవద్దన్న నిర్ణయం ఆ నిమిషంలో వరదలో కొట్టుకుపోయిన కాగితపు పడవ అయింది. డాక్టర్ కార్ పార్క్ చేసి లోపలికి వచ్చేటప్పటికి ఆమె ప్రాథమిక చికిత్స

చేసేసింది. "థేంక్స్ సిస్టర్' ' అన్నారాయన. తర్వాత వరుణ్‌ని మందలించేరు.

"చదువుకున్నవారు మీరే ఇలా ప్రవర్తిస్తే ఎలా? డాక్టర్ ప్రిస్క్రైబ్ చేయనిదే మందు ఎలా వేసుకుంటారు?"

ఆ రోజు మొదలు డిస్పెన్సరీకి క్రమం తప్పకుండా రాసాగాడు అరుణ్. నలభైని పదహారు, ఇరవైని అరవై చేసే శక్తి కేవలం ప్రేమకే వుంది. ఆ వడి వయస్సులో వున్న అరుణ్ టీనేజ్ కుర్రాడైపోయేడు.

మొదట్లో ఆమె ముభావంగా వుండేది. తరవాత మనస్సు విప్పింది. కట్నం కోసం ఇప్పటికీ సాధించే అత్తగారు, తాగివచ్చి శరీరాన్ని ఫుట్‌బాల్‌లా వుపయోగించుకునే భర్త, ఏడాదిలో పది నెలలు పుట్టింట్లో గడిపే ఆడపడుచు వేధింపు........

అతనిలో కేవలం స్నేహితుడినే చూసిందామె అప్పట్లో.

ఆపైన ఇదమిద్ధమని చెప్పలేని భావం మొదలై మనసంతా కర్పూర పరిమళంలా ఆవరించేసింది.

—అదే ప్రేమా? అన్నది ఆమెకి తెలీదు.

సౌదీలో వుద్యోగం వచ్చింది అరుణ్‌కి. సుచరితని వచ్చేయమని రోజూ అడుగుతున్నాడు.

"ఉత్తరానికైనా కరుగుతావేమో అని రాశానది" అన్నాడు. ఆమె చిరునవ్వు నవ్వి ఊరుకుంది.

అక్కడికి వెళ్ళేక మిగిలిన విషయాలు మాట్లాడదామన్నాడు. చాలా సేపు సంభాషించేడు అరుణ్. ఆమె ఓ నిర్ణయానికి వచ్చేసింది. "సరే"

ఆ రెండక్షరాలు అతనికి రెక్కలు కట్టేశాయి. ఆఘమేఘాల మీద తేలిపోతున్నట్టుగా వెళ్ళిపోయాడతను.

బరువుగా నేల వంటుకు పోయినట్టు అడుగులు వేస్తూ ఇల్లు చేరిందామె.

x x x

ఆ యింట్లో అడుగు పెట్టేందుకే సగం ప్రాణం వచ్చిపోతుంది. ఇరుకుగా వుండే ఇంట్లో అందరికంటే ఇరుకైన స్వభావం కల మనుష్యులు.

"ఎలా భరించింది ఇన్నేళ్ళు?"

అడుగు పెట్టగానే బావురుమంటూ ఏడుస్తూ సుడిగాలిలా కాళ్ళని చుట్టేసింది. ఆరేళ్ళ శైలూ. అక్షరాల సుచరితకి కూతురు ఆ అమ్మాయి. సుచరిత లేని లోటు తీరుస్తూ తన్నులూ తిట్లూ భరిస్తూంటుంది. ఎప్పుడో కానీ పెదవి కదపదు.

సంపాదిస్తూ తనెలాగూ సుఖపడటం లేదు. కనీసం కూతురైనా కడుపు నిండా తిండి, కంటికి నిద్ర నోచుకుంటుందా అన్న అనుమానం వచ్చినప్పుడు ఏ మూలో వున్న పౌరుషం నిద్ర లేస్తుంది. అదీ క్షణం సేపే. మరుక్షణం కర్మ సిద్ధాంతం "దాని తలరాత" అని సర్ది చెప్పి ధైర్యాన్ని కొండ చిలువలా మింగిస్తుంది.

లోపల నుండి ఆడపడుచు వేధిస్తుంది "అరకిలో మీటరు నడవడానికి అరగంటే పట్టిందమ్మ నీ కోడలికి"

ఆ క్షణంలో నిశ్చయించుకుందామె. వెళ్ళిపోతుంది. స్వేచ్ఛగా వచ్చే వారం నాంపల్లి స్టేషన్‌లో మినార్ ఎక్స్‌ప్రెస్‌కి. . . .

గంట ముందు రమ్మన్నాడతను.

అవును... హాయిగా... ఎగిరిపోతుంది... స్వేచ్ఛగా. . . !


x x x

గుండె ఉద్విగ్నతతో కొట్టుకుంటూ భావిని బద్దలు చేసేదిగా వుంది. ఆమె బట్టలేవీ తీసుకెళ్ళ దల్చుకోలేదు. ఒరిజనల్స్ బేగ్‌లో పెట్టుకుంది. శైలూని గురించిన ఆలోచన మాత్రం కాళ్ళకి బంధం వేస్తూంది. పాపనితీసుకెళ్ళాలంటే దానికి పాస్‌పోర్టు లేదు. తను వెళ్ళిపోయిన తరువాత సుఖంగా చూస్తారేమో అన్న పిచ్చి నమ్మకంతో సుచరిత కుడికాలు బయటపెట్టింది.

x x x

ప్లాట్ ఫామ్ మీద గందరగోళాన్ని ఛేదిస్తూ కూత పెట్టింది రైలు... అనౌన్సర్ స్వరం మైకు ద్వారా హెచ్చరిస్తూంది. అసహనంగా పవార్లు





## సి. నా. రె. ఛలోక్తులు

హైదరాబాద్ త్యాగరాయ గానసభలో ఏర్పాటయిన సాంస్కృతిక కార్యక్రమంలో హైకోర్టు ఉద్యోగి, ప్రముఖ రంగస్థల నటులు శ్రీ అంకయ్యగారికి సన్మానం జరుగుతోంది. ఆ సందర్భంగా అంకయ్యగారు వేదికపైన శ్రీకృష్ణుని పడక సీనుని నటించారు. చాలామంది ప్రముఖులున్న ఆ సభలో ఆ రోజు ఆ పాత్రను అంకయ్యగారు అత్యధికోత్సాహంతో ప్రదర్శించారు. అభినయం అవసరమైన దాని కంటే కొంచెం ఎక్కువయింది. ప్రదర్శన అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ డా. సి.నారాయణరెడ్డిగారు ప్రభుత్వోద్యోగిగా వుంటూ కళాసేవ చేస్తున్నందుకు అంకయ్యగారిని అభినందించారు. అంతేకాక పడకసీనులో శ్రీకృష్ణ పాత్ర పోషణ గురించి వ్యాఖ్యానిస్తూ "అంకయ్యగారి శ్రీకృష్ణ పాత్రలో సాక్షాత్తు కృష్ణపరమాత్మునితో పాటు శ్రీ ఆంజనేయస్వామివారు కూడా సాక్షాత్కరించారు" అనగానే సభలో నవ్వులు మొదలైనాయి. ఆ నవ్వుల మధ్యే సినారె కొనసాగిస్తూ "ఎందుకంటే శ్రీకృష్ణ పరమాత్ముని చిలిపితనానికి కొద్దిగా అల్లరితనాన్ని మిళితంచేసి శ్రీ ఆంజనేయస్వామివారి దర్శనభాగ్యాన్ని కల్గించిన అంకయ్యగారికి నా కృతజ్ఞతలు" అనగానే సభలో నవ్వులు ఇంకా ఎక్కువయ్యాయి. 'అతి'ని సున్నితంగా మందలించిన సినారె చమత్కారానికి అంకయ్యగారు నవ్వును ఆపుకోలేకపోయారు.

— జె.పి.విరూపాక్షరెడ్డి, హైదరాబాద్

◆ సేకరణ: డాక్టర్ ఎన్.గోపి

